
అక్షర
సకుటుంబ సచిత్ర అంతర్జాల మాసపత్రిక
ప్రత్యక్షరం సమకాలీన సమాజ సాక్ష్యం సహజ ధర్మ సంకేతం !

ఈ సంచికలో సీరియల్స్ కథలు పెద్ద కథలు శీర్షికలు కవితలు జీవనశైలి కార్టూన్లు Old Issues

కథలు »




అచ్యుతానందశర్మ ఈమధ్య ముభావంగా ఉంటున్నాడు.

మూర్తీభవించిన మంచితనం, మానవత్వంలతో అందరి తలలో నాలుకలా ఉంటూ అమ్మవారి గుడిలో అర్చకుడిగా

బాధ్యతలు నిర్వహించే అచ్యుతానందశర్మ అలా ఉండడానికి కారణం ఏమిటో ఇంట్లో వాళ్లకు, బయట వాళ్లకు అర్థం కావడం లేదు.

ఆయనకు ఇద్దరు కొడుకులు, కూతుళ్లు. పెళ్లిల్లు చేసేశాడు. ఇహ ఆయన భార్య సోమిదేవమ్మ- భర్త అంటే పంచ ప్రాణాలు. భర్త సేవలో తరించి పోవాలనుకునే మనస్తత్వం. నిజానికి బాధ్యతలన్నీ తీరిపోయి కృష్ణా!రామా!! అనుకోవలసిన వయసులో అలా మౌనాన్ని ఎందుకు ఆశ్రయించాడో ఎవరికీ తెలియడం లేదు. అడిగితే చెప్పడు.

ఒకరోజు వెంకటేశ్వరమూర్తి వాళ్లింటికొచ్చాడు. వెంకటేశ్వరమూర్తి అంటే అచ్యుతానందశర్మ గురువు. ఆయన మాటంటే అచ్యుతానందశర్మకు వేదవాక్కు. సంవత్సరంలో ఎప్పుడో ఒకప్పుడు అచ్యుతానందశర్మ ఇంటికి వచ్చి ఓ నాలుగైదు రోజులుండి వెళతాడు. అప్పుడు అచ్యుతానందశర్మ తనక్కలిగిన సందేహాలు విన్నవించుకుని గురువుగారిద్వారా సమాధానాలు పొంది సంతృప్తినొందుతాడు.

వచ్చిన మొదటిరోజునే గమనించేశాడు అచ్యుతానందశర్మ పరిస్థితి.

"అచ్యుతా! రాత్రి నీతో శాస్త్ర చర్చచెయ్యాలి. డాబాపైన చాపలు వేయిస్తే ప్రకృతిని ఆస్వాదిస్తూ గడుపుదాం.సరేనా?"అన్నాడు.

అది పరోక్షంగా తనకు చెప్పినట్టే అని భావించిన సోమిదేవమ్మ రాత్రి భోజనాలయ్యాక, డాబాపైన చాపలు పరచి కొన్ని పళ్లు, పాలూ, మచినీళ్లు, విసన కర్రలూ ఉంచింది.

*****

రాత్రి-

"అచ్యుతా! నీ ముభావానికి కారణమేమిటి? ఎందుకిలాగయ్యావు? బాధ్యతలన్నీ తీరిపోయి నిత్యం దేవతార్చనలు, అనుష్ఠానాలు చేస్తూ, ఆధ్యాత్మిక మార్గంలో పురోగమిస్తూ స్థితప్రజ్ఞతకు చేరుకోవలసిన ఈ వయసులో నీ మౌనమేమిటి. నీ భార్యను, నీ ఇంట్లోని పనివారలను, నిన్ను కలుసుకోవడానికి వచ్చే అవసరార్థులనూ చూస్తే నువ్వు చాలాకాలం నుంచీ మానసికవేదన అనుభవిస్తూ వారికి ఖేదం కలిగిస్తున్నావని నాకు అవగతమైంది. నా ముందు నీ మనసు విప్పు. సమస్యను పిపీలికం చెద్దాం."అన్నారు ఆప్యాయంగా.

గురువుగారి అనునయపు మాటలతో అచ్యుతానందం నోరు తెరిచాడు-"ఏం చెప్పమంటారు? ఊహ తెలిసినప్పటి నుంచీ దేవతార్చన చేస్తున్నాను. నా గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. పదిమంది మంచినే కోరుకున్నాను.

కాని నాకు జరిగిందేమిటి? మా రెండో కొడుక్కి చదువబ్బలేదు. పెళ్లాం, ఒక పిల్లాడితో వాడు నానా యాతనా పడుతున్నాడు. అలాగే నా పెద్ద కూతురు కౌసల్య. దానికి నాకున్నంతలో బాగానే కట్న కానుకలిచ్చి ఒక అయ్య చేతిలో పెట్టాను. వాడు ఒక ఏబ్రాసి. పిల్లని ఇక్కట్లపాలు చేస్తున్నాడు. దూరంగా ఉన్నప్పుడు నా దృష్టిలోకి వాళ్ల సంసారం పడదు కాబట్టీ మనసు నిబ్బరం చేసుకుని గడిపేస్తాను. పండగలొచ్చినప్పుడు నా ముందే వాళ్ల ఈసడింపులు, గొడవలు జరగడం, గొంతెమ్మ కోర్కెలతో నన్నూ హింసించడం..ఏం చెప్పమంటారు. నా మంచితనానికీ, నిత్యపూజలకు లభించిన వరమది. రాబోయే ఉగాదికి మళ్లీ వాళ్లందరూ నా కళ్లముందు తిరుగాడుతూ, నా మనసును అతలాకుతలం చేస్తారన్న బెంగ పట్టుకుంది. మానసికంగా చాలా నలిగిపోతున్నాను గురువుగారూ, మీ దగ్గరన్నా సాంత్వన లభిస్తుందేమోనని ఎదురుచూస్తున్నాను"అన్నాడు గద్గదస్వరంతో.

వెంకటేశ్వరమూర్తి తేరిపారా ఒకసారి అచ్యుతానందశర్మను చూశాడు. ఆ తర్వాత కొన్ని క్షణాలు మౌనం వహించి-"చూడు

అచ్యుతా, భగవంతుడికి మనందరం సమానమే! మన ఋజువర్తన, మంచితనం ఫలితాలు వెంటనే కనిపించవు. అంతమాత్రం చేత మానసికంగా బలహీనమవ్వకూడదు. 'లోకో భిన్న రుచిః' అన్నా 'అరచేతికున్న ఐదువేళ్లూ ఒక్కలా ఉండవన్నా' ఈ లోకంలోని మనుషులు భిన్న మనస్థత్వాలు కలిగి ఉంటారనేది వాస్తవం. పిల్లల్ని కంటాం కాని వాళ్ల రాతలు కాదు. అవి వాళ్ల వాళ్ల పూర్వ జన్మ కర్మల మీద ఆధారపడి ఉంటాయి. అయితే కొన్ని వాసనలు సజ్జనసాంగత్యంతో వదిలిపోవచ్చు. ఏదేమైన మనం నిమిత్తమాత్రులమైతేనే ఇక్కడ మనగలుగుతాం. ప్రతిదాని గురించీ చింతిస్తు పోతే బతుకు భారం కావడం ఖాయం. అందుకే పరిష్కారాలు మన పరిధిలో ఉన్నాయేమోనని చూసుకోవాలి..ఉంటే సరిచేసుకోవాలి. లేదంటే వదిలెయ్యాలి. మనిషి జీవితం సమస్యల మయం. అందులోంచి ఎలా బయటపడతాడన్నదే జీవితం. జీవితం ఆరు రుచుల సమాహారం. అవి తప్పవు. కాకపోతే నిష్పత్తి మారుతూంటుంది. దాన్ని ప్రతిఫలింపజేస్తూ ఉగాది నాడు షడ్రుచుల ఉగాది పచ్చడిని చేసుకుతినడం సంప్రదాయంగా మారింది. అలాగే పంచాంగ శ్రవణం. భవిష్యత్తు అందరికీ ఆశావహంగా ఉండకపోవచ్చు..అయినా ఆహ్లాదంగా జీవిస్తున్నారా లేదా? పుట్టుక నుంచీ మరణం వరకు జీవికి ప్రతిక్షణం విలువైనదే! దాన్నీ అర్థవంతంగా గడపాలి, మీమాంసతో కాదు. కర్మ చేయడం వరకే మన పని..ఫలితం ఆశించకూడదు. సకల జనావళి అభ్యుదయాన్నాశించడమే మన విధి. దానిని నువ్వు ఎట్టి పరిస్థితుల్లోనూ మరవకూడదు. ఇదీ నువ్వు అర్థం చేసుకోవలసింది. సంస్కృతీ సంప్రదాయాలను యాంత్రికం చేసుకున్న వాళ్లకు ఇవి తెలియవంటే అనుకోవచ్చు కానీ నిత్యం వాటిలోనే నిమగ్నమయి ఉండే నువ్వు పరిధి దాటిపోవడమే ఆశ్చర్యంగా ఉంది"అన్నాడు సౌమ్యంగా.

"అర్థమైంది గురువుగారూ, మనసులోని చీకట్లను మాటల జ్యోతులతో పారదోలారు. నా మనసుకు ప్రశాంతత చేకూరింది. త్రికరణశుద్ధిగా మీకు పాదవందనాలు సమర్పించుకుంటున్నాను. మీరు పడుకోండి"అన్నాడు.

*****

ప్రత్యూషవేళ.

తెల్లవారుఝామున ఉదయించే సూర్యుడున్నట్టు తేటగా ఉన్న భర్త ముఖం చూసి సోమిదేవమ్మ ఆనందం అర్ణవమైంది.

***

Add Comment

Log In to Post

NEWEST ▼